




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 265


పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 29 ఫిబ్రవరి 2024


# మనది రైతు ప్రభుత్వం

## • వైఎస్సార్ రైతు భరోసా నిధులు జమ చేసిన సీఎం జగన్



**గుంటూరు,కలంకౌంటర్ :** వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయం సొమ్మును రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జమ చేశారు. రబీ 2021–22, ఖరీఫ్–2022 సీజన్లకు గాను అర్హులైన రైతు కుటుంబాలకు సున్నా వడ్డీ రాయితీ సొమ్మును కూడా చెల్లించారు. ఈ రెండు పథకాలకు అర్హత పొందిన రైతు కుటుంబాల ఖాతాలకు సాయాన్ని బుధవారం సీఎం జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. వరుసగా ఐదో ఏడాది రైతు భరోసా అందిస్తున్నాం. మొత్తం 53.58 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.1,078.36 కోట్లు జమ. కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూముల సాగు రైతులకు సాయం. 57 నెల్లలో రైతు భరోసా కింద అందించిన మొత్తం రూ.34,288 కోట్లు. మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా ఒక్కో రైతన్నకు అదనంగా రూ.17,500 ఇస్తున్నామన్నారు.

**రైతు ప్రభుత్వం మనది :** మన ప్రభుత్వం వేసిన ప్రతీ అడుగూ కూడా రైతులు, రైతు కూలీలు బాగుండాలని వేశాం. క్రమం తప్పకుండా వైయస్సార్ రైతు భరోసా కింద సహాయాన్ని అందించాం. పెట్టుబడి సహాయంగా, రైతన్నకు దన్నుగా ఇది అందించాం. రాష్ట్రంలో దాదాపు 50శాతం లోపు రైతులన్నకున్న భూమి అర హెక్టారు లోపలే. హెక్టారు లోపల ఉన్న రైతులు 70 శాతం ఉన్నారు. ఈ పెట్టుబడి సహాయం వారికి ఎంతో మేలు చేసింది. వంద శాతం రైతులకు 80శాతం ఖర్చు రైతు భరోసా కింద కవర్ అయ్యిందన్నారు. పేద రైతుల పక్షపాత ప్రభుత్వం మనది, దీనికి నేను గర్వపడుతున్నాను. సున్నా వడ్డీ కింద కూడా రూ.215.98 కోట్లు విడుదల చేస్తున్నాం. రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా కట్టే రైతులకు మేలు చేస్తున్నాం.ఇప్పటివరకూ 84.66 లక్షల మంది రైతన్నలకు ఇప్పటి వరకూ అందించిన వడ్డీ రాయితీ 2,050 కోట్లు. మొత్తంగా రైతు భరోసా, సున్నా వడ్డీ కింద రైతులకు ఇవాళ విడుదలచేస్తున్న మొత్తం రూ.1,294.38 కోట్లు అందించామన్నారు.

**ప్రతీ అడుగులోనూ రైతన్నలకు తోడు :** ప్రతీ అడుగులోనూ రైతన్నలకు తోడుగా నిలుస్తున్నాం. ప్రతీ పథకం దాదాపుగా పేద రైతు కుటుంబానికి అందుబాటులో ఉంచడం జరిగింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఏడాదికి రూ.12500 బదులు వేయి పెంచి రూ.13500 ఇచ్చాం. 50వేల స్థానంలో ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చాం. చెప్పినదానికంటే ఎక్కువగా ఇచ్చిన ప్రభుత్వం మనది. .

**రైతులకు నాణ్యమైన ఉచిత కరెంట్ :** 19 లక్షల మంది రైతులకు 9 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. ఉచిత విద్యుత్ కింద ప్రతి రైతుకు రూ.45వేల మేర మేలు జరుగుతుంది. ఏడాదికి దాదాపుగా రూ.9 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రైతుల తరఫున ఉచిత పంటల బీమాకు ప్రీమియం కడుతున్న ఏకైక రాష్ట్రం మన రాష్ట్రం మనది. గతంలో ఎప్పుడూ కూడా రైతుల తరఫున ఎప్పుడూ బీమా ప్రీమియం చెల్లించలేదు. దేశంలో కూడా ఎక్కడా లేదు. రైతులకు ఎక్కడ కష్టం వచ్చినా ఏ సీజన్‌లో నష్టం జరిగితే అదే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం.

**ఆక్వా రైతులకు సాయం :** గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను పెట్టాం. అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను రైతుకోసం పెట్టాం. రైతులకు ఇ–క్రాప్ చేస్తూ అన్నిరకాలుగా ఆదుకుంటున్నాం. విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ కూడా రైతులను చేయిపట్టుకుని నడిపించాం. ఈ ఐదేళ్లకాలంలో మాత్రమే ఇలా జరిగింది. ఆక్వా రైతులకు రూ.1.5కే కరెంటు ఇస్తూ ఆదుకున్నాం. ఆక్వాజోన్లలో ఉన్న ఆక్వారైతులకు తోడుగా నిలిచాం. పాల సేకరణలో కూడా రైతులకు తోడుగా నిలిచాం. రూ.10–20ల వరకూ రైతులకు అధిక ధరలు వచ్చాయి. పాలసేకరణలో ఈ ఐదేళ్ల కాలంలోనే రైతులకు రేట్లు పెరిగాయి. సహకార రంగంలోనే దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన అమూల్‌ను తీసుకు వచ్చి ఈ రంగంలో పోటీని పెంచాం. తద్వారా రైతులకు మేలు జరిగిందన్నారు.

**భూ వివాదాలకు చెక్‌పడుతూ సమగ్ర సర్వే :** 100 సంవత్సరాల క్రితం భూ సర్వే జరిగింది. అప్పటినుంచి రికార్డులు అప్‌డేట్ కాకపోవడం, సబ్ డివిజన్లు జరక్కపోవడం జరిగింది. వివాదాలకు చెక్‌పడుతూ సమగ్ర సర్వే చేపట్టాం. రికార్డులను అప్‌డేట్ చేస్తూ రిజిస్ట్రేషన్ సేవలను గ్రామస్థాయిలో తీసుకు వచ్చాం. 34.77 లక్షల ఎకరాల మీద పూర్తి హక్కులను రైతులకు, పేదలకు కల్పించాం. ఈ ఐదేళ్ల కాలానికి తేడా గమనించాలని కోరుతున్నాను. 87,612 కోట్ల రూపాయలు రైతుల రుణాలు మాఫీచేస్తామని చంద్రబాబు చెప్పారు. బ్యాంకుల్లో బంగారం రావాలంటే బాబే ముఖ్యమంత్రి కావాలన్నారు. దీంతో రైతులు నమ్మి అధికారం ఇస్తే దారుణంగా మోసం చేశారన్నారు. మనం ఈ ఐదేళ్లలో వైయస్సార్ రైతు భరోసా కింద రూ.34వేల కోట్లు ఇచ్చాం. ధాన్యం కొనుగోలుకోసం రూ.65 కోట్లు ఖర్చు చేశాం. ఇదికాక రూ.1.2 లక్షల కోట్లు రైతన్నలకు వివిధ పథకాలు ద్వారా అందించామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎం వీ యస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు ఐ తిరుపాల్ రెడ్డి, ఉద్యానవనశాఖ సలహాదారు పి శివప్రసాద్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సి హరికిరణ్, ఉద్యానవనశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ ఎస్ శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

## వైఎస్ఆర్‌సీపీ నేత గుణ్ణం నాగబాబు కుమారుడి వివాహ వేడుకకు హాజరైన సీఎం వైఎస్ జగన్



**భీమవరం,కలంకౌంటర్ :** రాధాకృష్ణ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడుకలో వరుడు మణికంఠ వెంకట సుబ్బారావు (సుభాష్), వధువు విజయ దీప్తిలకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి

## పుస్తకావిష్కరణ లో సి ఎం జగన్



**తాడేపల్లి,కలంకౌంటర్ :** వ్యవసాయం సుసంపన్నం– రాష్ట్రానికి సౌభాగ్యం పేరుతో ఐదేళ్లలో వ్యవసాయ రంగ ప్రగతిపై వ్యవసాయశాఖ రూపొందించిన పుస్తకాన్ని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైయస్.జగన్

## చిన వెంకన్న సేవలో రాష్ట్ర మంత్రులు







**ద్వారకా తిరుమల,కలంకౌంటర్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని డిప్యుటీ సీఎం, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితలు బుధవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తర్వాత ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు చినవెంకన్న జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఐదుగురు రెడ్ల కోసం 5 కోట్ల ప్రజలకు తిప్పలు

• చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరం • జనసేన అధినేత పవన్‌కల్యాణ్





**తాడేపల్లిగూడెం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వర్గాలను జగన్ మోసం చేశారని, సిద్ధం అంటున్న ఆయనకు యుద్ధం ఇద్దామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన టీడీపీ – జనసేన ఉమ్మడి సభలో పవన్ మాట్లాడారు. "పర్వతం ఎవరికీ వంగి సలాం చేయదు. గొంతు ఎత్తితే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరు ఉంటుంది. మన విజయానికి స్ఫూర్తి జెండా.. అందుకే జెండా పేరుతో సభను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ రోడ్లపై వెళ్లాలంటే రోజులు గడిచిపోయే పరిస్థితి. ఐదుగురు రెడ్ల కోసం 5 కోట్ల ప్రజలు తిప్పలు పడుతున్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో అయినా ఈ ఐదుగురే పంచాయితీ చేస్తున్నారు. మిగతా ఏ నాయకులకు ఎలాంటి హక్కులు లేవు. సభా వేదికగా చెబుతున్నా. వైసీపీ గూండాలు తెలుగు–జనసేన నాయకులను, శ్రేణుల్ని ఇబ్బంది పెడితే మక్కెలు విరగొడతామన్నారు.

**చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరం :** తాను ఒక్కడినే అంటున్న జగన్ మా ఒక్క ఎమ్మెల్యేను లాక్కున్నారు. జూబ్లీహిల్స్ ఫాంహౌస్‌లో ఇల్లు కట్టుకున్నప్పట్నుంచి జగన్ బతుకు నాకు తెలుసు. జగన్ ఇప్పటి వరకు పవన్ తాలూకా శాంతినే చూశావు. 4 దశాబ్దాల రాజకీయ ఉద్ధండుడిని జైలులో పెడితే బాధ వేసింది. అందుకోసమే కూటమిని నేనే ప్రతిపాదించా. చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరం. నా నిర్ణయాలు పార్టీ, వ్యక్తి పరంగా ఉండవు, రాష్ట్ర లబ్ధికోసమే ఉంటాయి. టీడీపీ–జనసేన సహకరించుకుంటూనే ప్రజల భవిష్యత్తు బాగుంటుంది. కోట్లు సంపాదించే స్కిల్స్ ఉన్నా అన్నీ కాదనుకొని వచ్చా. సినిమాల్లో వచ్చే డబ్బును ఇంట్లో బియ్యం కొనకుండా హెలికాప్టర్లకు వెచ్చిస్తున్నానని పవన్ అన్నారు.

## అగ్నికి వాయువు తోడైనట్టు పవన్ మనతో చేయి కలిపారు

• తాడేపల్లిగూడెం సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు




**తాడేపల్లిగూడెం,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఒక సైకో ముఖ్యమంత్రి ఉన్నాడంటూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాడేపల్లిగూడెం సభలో ధ్వజమెత్తారు. విపక్ష నేతలను తిరగనివ్వకుండా చేసేందుకు, మీడియాను కంట్రోల్ చేయడం కోసం జీవో నెం.1 తీసుకువచ్చాడని, మీటింగులను అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాడని విమర్శించారు. గత ఎన్నికల ముందు ముద్దులు పెట్టి, ఎన్నికల తర్వాత పిడిగుద్దులు గుద్దే పరిస్థితికి తీసుకువచ్చాడని అన్నారు. జగన్ ఒక బ్లఫ్ మాస్టర్ అని అభివర్ణించారు. బ్లఫ్ మాస్టర్ అంటే పదే పదే అబద్ధాలు చెప్పడం, తాను చేయని పనులను చేశానని చెప్పుకునేవాళ్లు అని వివరించారు. పూర్వం రోజుల్లో కనికట్టు కట్టేవాళ్లు ఉండేవాళ్లు... అలాంటివాడే ఈ జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కుప్పం ప్రజలెవరూ నీ మాటలు నమ్మరు జగన్ : నిన్ననే కుప్పంలో చూశారు. నా నియోజకవర్గం గురించి పేపర్లో వచ్చింది. 35 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నాను. ముఖ్యమంత్రిగా చేశాను. కుప్పానికి నీళ్లు అంటూ నిన్న ఈ ము–ఖ్యమంత్రి నాటకాలు వేశాడు. నేరుగా కుప్పం వెళ్లాడు. ట్యాంకర్లలో నీళ్లు తీసుకెళ్లి కాలువల్లో వదిలాడు... గేట్లు కూడా పెట్టాడు. ఓ సినిమా సెట్టింగ్ ను తలపించేలా చేశాడు. నీళ్లు వదిలిపెట్టి వచ్చాడు... కానీ తెల్లవారితే నీళ్లు లేవు అక్కడ. కేవలం 23 గంటల్లో అంతా ముగిసింది. ఇదీ ఈ ముఖ్యమంత్రి విశ్వసనీయత. ఇవాళ తాడేపల్లిగూడెం నుంచి చెబుతున్నా. కుప్పంలో నాకు లక్ష మెజారిటీ ఖాయం. నీ మాటలు కుప్పం ప్రజలెవరూ నమ్మరు. అట్టర్ ఫ్లాప్ అయిన సినిమాకు సీక్వెల్ ఉండదు. ఇక 40 రోజులే మిగిలుంది. వైసీపీ రౌడీలకు 40 రోజుల తర్వాత రియల్ సినిమా చూపిస్తామని ఈ సభ ద్వారా హెచ్చరిస్తున్నాం. టీడీపీ–జనసేన పొత్తు సూపర్ హిట్. నీ కుట్రలు, నీ కుతంత్రాలు అట్టర్ ఫ్లాప్.. విధ్వంసాలకు ఫుల్ స్టాప్. టీడీపీ–జనసేన కూటమి ఒక విన్నింగ్ టీమ్..వైసీపీ ఒక ఛీటింగ్ టీమ్. అగ్నికి వాయువు తోడైనట్టు పవన్ కల్యాణ్ మనతో చేయి కలిపారు. అగ్నికి వాయువు తోడైతే వైసీపీ బుగ్గి అయిపోతుందన్నారు.

**ప్రజల్లో ఉండే వాళ్లే మా అభ్యర్థులు :** ఎన్నికల నేపథ్యంలో ఒక బాధ్యతగా అభ్యర్థుల ఎంపిక చేస్తున్నాం. 1.30 కోట్ల మంది నుంచి అభిప్రాయ సేకరణ చేసి, ప్రజల్లో ఉండే వాళ్లనే గుర్తించి అభ్యర్థులుగా ప్రకటిస్తున్నాం. మా అభ్యర్థులను చూశాక జగన్ లో భయం మొదలైంది. మళ్లీ అభ్యర్థులను మార్చుతానంటున్నాడు. మన అభ్యర్థులు విద్యావంతులు, పేరున్న వాళ్లు... జగన్ అభ్యర్థులు స్మగ్లర్లు, రౌడీలు. వైసీపీ అభ్యర్థులు మళ్లీ గెలిస్తే రాష్ట్రంలో ఎవరికీ రక్షణ ఉండదు. మాఫియా నేతలు కావాలా, ప్రజలకు సేవ చేసే మంచి వ్యక్తులు కావాలా? అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా బీసీ డిక్లరేషన్, ఎస్సీ డిక్లరేషన్ ఇస్తాం. ఎస్టీల కోసం ఆలోచిస్తాం, మహిళల కోసం ప్రకటన చేస్తాం, రైతుల కోసం ఆలోచిస్తాం, ఉద్యోగులకు కూడా న్యాయం చేస్తాం. త్వరలోనే టీడీపీ–జనసేన ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు.

## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పాల రాము





**పెడన( కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** గూడూరు మండలం, లేళ్ళగరువు గ్రామంలో జరుగుతున్న నూతన రామాలయం ప్రారంభ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గం శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము.

## తిరువూరు లో ఘనంగా టైలర్స్ డే



**తిరువూరు,కలంకౌంటర్ :** టైలర్స్ డే సందర్భంగా తిరువూరు పట్టణ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. చీరాల సెంటర్ నుండి బోస్ బొమ్మ సెంటర్ వరకు ప్రధాన రహదారిలో టైలర్స్ ప్రదర్శన నిర్వహించారు

## మహా రుద్రాభిషేకానికి ఎస్సై నాగరాజుకు ఆహ్వానం

- తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం జగ్గంపేట నియోజకవర్గం



**గోకవరం,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,జగ్గంపేట మాజీ శాసన సభ్యులు ఇర్రిపాకలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 26వ తేదీ నుండి మార్చి 7 తేదీ వరకు కోటి పార్థివ లింగ మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్న సంగతి విధితమే... ఈరోజుతో మూడవరోజు పూర్తి కానుంది.ఈ మహాశివుని కార్యక్రమం యొక్క ఆహ్వాన పత్రికను గోకవరం ఎస్సై కె నాగరాజుకు అందించినట్టు తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ పులపర్తి బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా కోటి మట్టిలింగాలు తయారుచేసి ఒకే చోట మహా కుంభాభిషేకం చేయడం జరగలేదని, అటువంటి మహత్తర కార్యక్రమాన్ని జ్యోతుల నెహ్రూ కుటుంబం ఇర్రి పాకలో ఎంతో ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమంలో 11 రోజులపాటు ప్రతిరోజు ఏదో ఒక పీఠం నుంచి పీఠాధిపతి వస్తారని భక్తి ప్రవచనాలు, ఆధ్యాత్మిక వేద మంత్రాలతో ఆ ప్రాంతమంతా ఘోషిస్తుందని కులమతాలకు అతీతంగా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని ఆ పరమశివుడు కృపకు పాత్రులు అవుతారని ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు. ఇదివరకే స్థానిక ఎమ్మార్వో కు, ఎంపీడీవోకు, అధికారులకు ఈ యొక్క ఆహ్వాన పత్రికలు అందించడం జరిగిందని, ఈ యొక్క మహా పుణ్య కార్యంలో అందరూ భాగస్వాములు కావాలని బుజ్జి తెలిపారు.

## బి .ఆ ర్ ఆక్స్ ఫర్డ్ స్కూల్ లో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు





**కందుకూరు, కలంకౌంటర్ :** పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డు లో గల బి .ఆర్ ఆక్స్ ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ నందు బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బి .ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ.. సర్ సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 న “జాతీయ దినోత్సవం” గా జరుపుకుంటారని,విద్యార్థులు చిన్ననాటి నుంచే విభిన్న ఆలోచనల, తార్కిక నైపుణ్యాలను అలవాటుచేసుకోవాలని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలు గా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కర రావు,బి.నరేంద్ర బాబు,పాఠశాల డీన్ రామారావు, ప్రిన్సిపాల్స్ మల్లికార్జున,నజీర్,సునీత,తదితర ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొడాలి నాని

- ఆలయ అభివృద్ధికి 50వేలు అందించిన ఎమ్మెల్యే





**గుడివాడ,కలంకౌంటర్ :** గుడ్లవల్లేరు మండలం సంత రోడ్డులో వేంచేసియున్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి దేవస్థాన 71 వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ముగిసాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రారంభించారు. తొలుత వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికు వేద పండితులు, దేవస్థాన కమిటీ పెద్దలు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామివారికి ఎమ్మెల్యే కొడాలి నాని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే నానికి వేద ఆశీర్వచనాలు అందచేయగా, దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు స్వామి వారి ఫోటో జ్ఞాపికను అందజేసి ఆలయ సంప్రదాయం ప్రకారం దృశ్శాలతో సత్కరించారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధికి ఎమ్మెల్యే కొడాలి నాని 50వెలు అందచేశారు. అనంతరం దేవస్థాన కమిటీ పెద్దలతో కలిసి ఉత్సవాల ముగింపు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రారంభించి, భక్తులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఆధ్యాత్మిక చింతనలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరు భక్తి భావనను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కొడాలి నాని సూచించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమని, శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కొడాలి నాని ఆకాంక్షించారు. ముగింపు అన్న సమారాధన కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ గుడివాడ గుప్తా , సభ్యులు కొమ్మనబోయిన రవిశంకర్, గుడ్లవల్లేరు వైస్ ఎంపీపీ సాయన రవి, గుడివాడ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను,వైసిపి నాయకులు పాలేటి చంటి, అడబాల అప్పారావు, మండల యూత్ అధ్యక్షుడు గుదే రవి, సింగంశెట్టి ఆదినారాయణ, కుంచపర్తి సాయి, కొడాలి సుధాకర్, కిషోర్ నాయుడు, వీరబత్తిన రవి, మహారెడ్డి మురళి,సర్పంచ్ కోటప్రోలు నాగు, కోటప్రోలు బాబురావు, భక్తులు పాల్గొన్నారు.

## క్షత్రియ స్థాయి బలోపేతం...వర్మదే ఆధిపత్యం



**పిట్టలవానిపాలెం,(బాపట్ల జిల్లా), కలంకౌంటర్ :** బలమైన ఓటు బ్యాంకు లేకపోయినా క్షత్రియ సామాజిక వర్గానికి బాపట్ల నియోజకవర్గంలో అత్యధిక ప్రాధాన్యత లభిస్తూ వస్తోంది.నియోజకవర్గంలో క్షత్రియ సామా జిక వర్గానికి తెలుగుదేశం పార్టీలోనే అగ్ర తాంబూలం లభించింది. ఈ నియోజకవర్గ నుండి ఐదు సార్లు ఆ సామాజిక వర్గానికి పోటీ చేసే అవకాశం దక్కింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత నుండి ఇప్పటివరకు పరిశీలిస్తే పదిసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అందులో ఐదు సార్లు క్షత్రియ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభిం చింది. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన చంపాటి విజయరామరాజు ఈ నియోజకవర్గ నుండి తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత తొలి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1989లో బుద్ధాం గ్రామానికి చెందిన పెనుమత్స అచ్యుతరామరాజుకు తెలుగుదే శం పార్టీ టికెట్ కేటాయించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చీరాల గోవర్ధన్ రెడ్డి విజయం సాధించారు. 1999 లో ఖాజీపాలెం కు చెందిన మంతెన అనంత వర్మ కు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది.ఆ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. తర్వాత రెండోసారి తిరిగి టికెట్ కేటాయించినప్పటికీ ఆయన గెలవలేదు. అప్పటినుండి రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి బాపట్ల ప్రజలు విరామం ప్రకటించారు. తాజాగా 2024 ఎన్నికల్లో క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వేగేశన నరేంద్ర వర్మ కు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబా బు తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించారు. నాలుగు సార్లు తెలుగుదేశం పార్టీలోనే క్షత్రియ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభించినప్పటికీ రెండుసార్లు విజయం సాధించారు. మిగిలిన రెండుసార్లు ఓటమి చెందారు. తాజాగా నరేంద్ర వర్మకు ఆ సామాజిక వర్గం నుండి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఐదు సార్లుగా బాపట్ల నియోజకవర్గ నుండి ఆ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం దక్కింది..

## మార్చి 10న అద్దంకి మేదరమెట్ల వద్ద సిద్ధం సభ

- 15 లక్షల మందికి సరిపడా ఏర్పాట్లు
- వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి. విజయసాయి రెడ్డి

**బాపట్ల రూరల్,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద మార్చి 3 న నిర్వహించ తలపెట్టిన సిద్ధం మహాసభ స్వల్ప మార్పు చేసి మార్చి 10న నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి తెలిపారు. అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల, పిచ్చుకుల గిడిపాడు జాతీయ రహదారి పక్కన సిద్ధం సభ ఏర్పాట్లను పార్టీ ముఖ్య నాయకులతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద సుమారు 98 ఎకరాల్లో సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సభకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల నుంచి 15 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు వచ్చేందుకు ఇప్పటికే 7 లక్షలకు పైగా సంసిద్ధత వ్యక్తం చేశారని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పార్టీ పటిష్ట ఏర్పాట్లు చేస్తోందని, సభా ప్రాంగణం వద్ద అన్ని కనీస వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన భీమిలి, ఏలూరు, రాప్తాడు సిద్ధం సభలు పెద్ద ఎత్తున విజయవంతం అయ్యాయని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ మేరకు ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న చివరి సిద్ధం మహాసభ మరింత విజయవతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్ర వర్ణాలకు చెందిన పేదలు వైఎస్సార్సీపీని ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ, ప్రభుత్వం చేయని విధంగా జగన్ ప్రభుత్వం పాలన అందించిందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాలపై ప్రజలకు, కేడర్ కు సిద్ధం సభలో సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తారని, సభ సాయంత్రం 3 నుండి 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. మార్చి 13, 14 తేదీల్లో ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం ఉందని, పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూస్తే ఎన్నికల్లో 175 కి 175 సీట్లు సాధిస్తామన్న ధీమా మరింత బలపడుతుందన్నారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ మేనిఫెస్టోపై కసరత్తు జరుగుతోందని అతి త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. అలాగే చివరి సిద్ధం సభకు ముందే అన్ని సీట్లు ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకున్నా ప్రజలు మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని విజయసాయి రెడ్డి అన్నారు. ఈ ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపిలు మోపిదేవి వెంకట రమణ, నందిగం సురేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశీల రఘురాం, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు బాచేపల్లి శివ ప్రసాద రెడ్డి, కరణం వెంకటేష్, హనిమిరెడ్డి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు జంకే వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రగతి టైలర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు..






**బాపట్ల,కలంకౌంటర్ :** పట్టణంలోని ప్రగతి టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మీసేవ ప్రక్కన టైలర్స్అసోసియేషన్ ఆఫీసు దగ్గర బుధవారం టైలర్స్ జెండా ఆవిష్కరణ అనంతరం కుట్టు మిషన్ సృష్టికర్త ఇలియాస్ హెూ వే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాపట్ల పురవీధులలో ఊరేగింపు గా పాల్గొని కూరగాయల మార్కెట్ దగ్గర గల షాది ఖానా వద్దకు చేరి బాపట్ల పట్టణ టైలర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో విశిష్టత అతిథి అలపర్తి నాగేశ్వరరావు, అల పర్తి శ్రీనివాసరావు టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులును ఘనంగా సత్కరించారు. బాపట్ల జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేల్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మా వృత్తినిప్రభుత్వం గుర్తించడం లేదని, వచ్చే తరంవారు ఈ వృత్తిని నేర్చుకునే వారు కూడా లేరు, వృత్తి లేకపోతే మనుగడ లేదు, ట్రైనింగ్ సెంటర్లు పెట్టాలి, సబ్సిడీ ఇవ్వాలికరెంట్ బిల్లులు తగ్గించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోదుగుల భాస్కరరావు జిల్లా టైలర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఉప్పలపాటి మాధవరావు, వేల్పూరి శ్రీనివాసరావు, షేక్ జిలానిరాష్ట్ర కమిటీ సభ్యులు,షేక్ మౌలా సాహెబ్ జిల్లా సహాయ కార్యదర్శి, బాపట్ల పట్టణ ప్రగతి టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు: ఎస్.కె. అల్లా బక్షు, పట్టణ కార్యదర్శి పొన్నాడ శ్రీనివాసరావు, షేక్ పీరా కోశాధికారి, షేక్ ఖాదర్ మస్తాన్ఉపాధ్యక్షులు,షేక్ నజీర్ సహాయ కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి గొప్ప మానవత్వాన్ని చాటుకున్న ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ సభ్యులు..



**కందుకూరు,కలంకౌంటర్ :** ఖాదర్ భాషా అనే వ్యక్తికి ఒంగోలు కిమ్స్ హాస్పిటల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిమిత్తం O+ (పాజిటివ్) రక్తం 4 యూనిట్లు అవసరమైంది. ఆ గ్రూప్ రక్తం దొరకక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఇంచార్జ్ అయుబ్ ఖాన్ పఠాన్ కి తెలియపరిచారు. వెంటనే స్పందించి ఫౌండేషన్ ప్రెసిడెంట్ సాజిద్, సభ్యుడు ఆషిక్ రక్తదానం చెయ్యటానికి వెంటనే ముందుకొచ్చి బుధవారం ఒంగోలు కిమ్స్ కి వెళ్లి రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతని చాటుకొని ప్రాణదాతలుగా నిలిచి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. రక్తదానం చేసిన సాజిద్, ఆషిక్ లని రక్తం పొందిన వ్యక్తి, ఆయన కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం చేసిన వాళ్ళు మరింత ఆరోగ్యంగా వుంటారు అని ఫౌండేషన్ సెక్రటరీ & ఫౌండర్ షంషిర్ తెలిపారు.

## నేడు శ్రీ జనార్ధన స్వామి ఆలయంలో నూతన రాజగోపుర కలశ ప్రతిష్ట,ధ్వజస్తంభ ప్రతిష్ట




**కందుకూరు,కలంకౌంటర్ :** శ్రీ స్కందపురి జనార్ధన స్వామి దేవస్థానంలో నేడు ఉదయం 11 గంటల నుండి 12 గంటల లోపు నూతనంగా నిర్మించిన రాజగోపురము కలశ ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట జరుగునని ఆలయ కార్యనిర్వాహణాధికారి బైరాగి చౌదరి, ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం తెలిపారు. ఆలయ అర్చకులు కందుకూరు శ్రీనివాస దీక్షితులు, వెంకట అనంత దీక్షితులు, అనిల్ కుమార్ స్వాముల ఆధ్వర్యంలో శ్రీ జనార్ధన స్వామి వారిని, ప్రసన్నాంజనేయ స్వామి వారిని కన్నుల పండగ గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ వేద పండితులు వేదాంతం విష్ణు భట్టాచార్యులు, శ్రీధర్ స్వామి వాళ్ల ఆధ్వర్యంలో ప్రతిష్టా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పుణ్యాహనం, అగ్ని ప్రతిష్ట,కలశారాధన,ఉక్త హెూమం,క్షీరాధివాసం, జలాధివాసం, సాయంత్రం పుణ్యాహనం, అగ్ని ప్రతిష్ట,కలశారాధన, శయనాదివాసం, హెూత్రం, హారతి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నుండి శ్రీ స్కందపురి జనార్ధన స్వామి ఆలయంలో నూతన రాజగోపురం కలిశ ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభం పునః ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ వేద పండితులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గురువారం రోజు జరిగే నూతన రాజగోపురం కలిశ ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ట లో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 29వ తేదీన ఉదయం 5 గంటల నుంచి ప్రతిష్టా కార్యక్రమాలు మొదలవుతాయని, ఆలయంలో సేవ చేసేవారు ముందుగా తనను సంప్రదించాలని ఆలయ ఈవో భైరవి చౌదరి తెలిపారు. ప్రతిష్టానంతరం సాయంత్రం ఐదు గంటలకు శాంతి కళ్యాణం, వీధి ఉత్సవం, ధ్వజారోహణ జరుగుతుందని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్వామి వారి సేవకులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ అభివృద్ధి ప్రశంసనీయం - కర్లపాటి





**మచిలీపట్నం కల్చరల్,కలంకౌంటర్ :** జిల్లా గ్రంథాలయం గతంలో కన్నా మెరుగుగా లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసిన చైర్మన్ కు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకత ఉందని ఆమెకు విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తిప్పరపల్లి జమలపూర్ణమును మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని ఆయన మీడియాకు తెలిపారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో అక్కడ లైబ్రరీ నిర్వహణ టెక్నాలజీ వినియోగం తదితర అంశాలు చైర్మన్ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. జగ్గయ్యపేట పరిధిలో బుక్ డిపాజిట్ సెంటర్ల ఆవశ్యకత గురించి చైర్మన్ కి విన్నమించినట్లు తెలిపారు. మేజర్ పంచాయతీల్లో అవసరమైన చోట సెంటర్ల ఏర్పాటుకు సహకరించినట్లు తెలిపారని ఆయన అన్నారు.

# గుడివాడ శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో లక్ష్మీ గణపతి హోమ పూజలు...



**గుడివాడ,కలంకౌంటర్ :** గుడివాడ పట్టణం మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో సంకటహర చతుర్దశి పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ గణపతి హోమ పూజలు బుదవారం అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన, హోమ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులతో కలిసి దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు,వేదపండితులు హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. లోక కళ్యాణార్థం, మానవాళి హితం కోరుతూ లక్ష్మీ గణపతి హోమ పూజలు నిర్వహిస్తున్నామని వేదపండితులు తెలియజేశారు.

# పేదలకు ఇళ్ళ పట్టాల పంపిణీ



**పిట్టలవానిపాలెం,(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పేదలందరికీ ఇళ్లు, కార్యక్రమంలో భాగంగా, బాపట్ల శాసనసభ్యులు కోన రఘు పతి ఆదేశాల మేరకు,ఇంటి స్థలం మంజూరు కాబడిన పేదలకు ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ కుంచం అనూష ప్రసన్నరాజు ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ చేయించిన ఇంటి పట్టాలను అందజేసారు., ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లీల శ్రీనివాస్ రెడ్డి , జె సి ఎస్ కన్వీనర్ అల్లూరి సురేష్ , యూత్ కన్వీనర్ గోపి , బాపట్ల జిల్లా కోశాధికారి దేవేంద్ర రాజు , బూత్ కన్వీనర్లు గుమ్మడి సీతయ్య , నాగేందర్ రెడ్డి, కాశీ విశ్వనాథ రెడ్డి , కాగిత గాబ్రీయేల్ , మేత్ర ఏడుకొండలు ,విఆర్ఓ నాగరాజు రెడ్డి , సెక్రటరీ శ్రీనివాసరావు, వాలంటీర్లు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలంగాణ భాష అంటేనే క్లాసిక్ గా ఉంటుంది: గవర్నర్ తమిళ్ సై..



**హైదరాబాద్,కలంకౌంటర్ :** 'తెలంగాణ భాష అంటేనే క్లాసిక్ భాష' అని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ భాష మాట్లాడు తున్నప్పుడు చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. తెలుగు భాష, సంస్కృతి అంతటా వ్యాప్తి చెందాలన్నారు. రవీంద్ర భారతిలో నేడు జరిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. పలు కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పట్టాలు అంద జేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తెలుగు భాషను ఇతర భాషలు మాట్లాడే ప్రజలందరికీ నేర్పించాలని పేర్కొన్నారు. ప్రగతి సాధించడానికి షార్ట్ కట్ ఏమీ ఉండదని, శ్రమనే ఆధారం అని చెప్పారు.. 'స్నాతకోత్సవం అనేది పెద్ద పండుగ.. సమాజానికి కొత్త దనాన్ని అందించడం మన బాధ్యత.. మాతృ భాష మన జీవితంతో ముడిపడి ఉంటుంది. తెలంగాణ భాష క్లాసిక్ భాష.. మాట్లాడుతు న్నప్పుడు ఆనందాన్ని కలిగిస్తుంది.. ప్రపంచంలో అనేక దేశాల్లో ఎంతో మంది తెలుగు వాళ్లు ఉన్నారు. ఈ తెలుగు భాష, సంస్కృతి అంతటా వ్యాప్తి చెందాలి. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్టు ఎన్ఈపీ విద్యాలయాలు ప్రారంభించాలి.. తెలుగులో మాట్లాడటం నాకు సంతోషంగా ఉంది.. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఇలాంటి పండుగ జరగడం ఎంతో ఆనందం, ఇది కన్నుల పండగగా ఉంది' అని తమిళిసై అన్నారు. మాతృ భాష మన జీవితంలో అవసరం.. తెలుగు మాట్లాడే వాళ్లు ప్రపంచ దేశాల్లో వివిధ రాష్ట్రాల్లో ఉన్నారు. తెలుగు భాషను ఇతర భాషలు మాట్లాడే ప్రజలందరికీ నేర్పించాలి.. తక్కువ ఖర్చుతో తెలుగు భాష పుస్తకాలను ప్రచురించి.. సామాన్య ప్రజలు కొని చదివే విధంగా ఉండాలి. 'నా మాతృ భాష తమిళ్.. నేను మా సోదర భాష తెలుగు మాట్లాడడం ఎంతో సంతోషంగా ఉంది' అని గవర్నర్ తమిళ్ సై సౌందరరాజన్ అన్నారు..

# కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమం

**ఉలవపాడు, కలంకౌంటర్ :** బుధవారం నాడు ఉలవపాడు మండలం కరేడు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మార్చి 3వ తారీఖున జరుగు పల్స్ పోలియో కార్యక్రమం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మార్చి 3 నుంచి 5 వ తేదీ లోపు జరిగే పల్స్ పోలియో కార్యక్రమం కరేడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు 25 బూత్ లు గానూ కరేడు బస్టాండు మరియు ఉలవపాడు రైల్వే స్టేషన్ ల వద్ద పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలియజేశారు.అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరం లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయబడునని తెలిపారు. దీనికి సంబంధించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలకు మరియు అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ, పిహెచ్ఎన్ హెల్త్ సూపర్వైజర్లు ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# 'భగవద్గీతా ఫౌండేషన్' వ్యవస్థాపకులు డా॥ఎల్వి గంగాధర శాస్త్రి కి 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' అవార్డు



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రసిద్ధ గాయకులు, భగవద్గీతా గాన, ప్రవచన, ప్రచార కర్త, 'భగవద్గీతా ఫౌండేషన్' వ్యవస్థాపకులు డా॥ ఎల్ వి గంగాధర శాస్త్రి కి భారత దేశపు ప్రతిష్ఠాత్మక 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' అవార్డు లభించింది. 2023 సంవత్సరానికి గాను - ఇతర ప్రధాన సంప్రదాయ సంగీత విభాగం లో ఆయనకు ఈ 'అకాడమీ పురస్కారం' లభించింది. తాను అభ్యసించిన కర్ణాటక శాస్త్రీయ సంగీతం తో - భారత దేశపు ఆధ్యాత్మిక సారమైన భగవద్గీత లోని 700 శ్లోకాలలో ఘంటసాల స్వరపరచి పాడిన 108 శ్లోకాలను ఆయన గౌరవార్థం యథాతథం గా పాడడం తో పాటు, మిగిలిన 594 శ్లోకాలను స్వీయ సంగీతం లో, తెలుగు తాత్పర్య సహితం గా గానం చేసి, అత్యున్నత సాంకేతిక విలువలతో రికార్డు చేసి, 'భారతీయ గాయకుడి తొలి సంగీత భరిత సంపూర్ణ భగవద్గీత' గా శ్రీ శ్రీ శ్రీ విశ్వేశ తీర్థ స్వామి, డా॥ ఏ పి జె అబ్దుల్ కలాం చేతులమీదుగా విడుదల చేసి, అంతటి తో తన బాధ్యత తీరిపోయిందని భావించకుండా, స్వార్థ రహిత ఉత్తమ సమాజ నిర్మాణం కోసం గీతా ప్రచారానికే తన జీవితాన్ని అంకితం చేసినందుకు గంగాధర శాస్త్రి కి ఈ అవార్డు దక్కింది. ఈ మహత్కార్యం చేసినందుకు గతం లో శ్రీ గంగాధర శాస్త్రి ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న'(హంస) పురస్కారం తోను, మధ్యప్రదేశ్ లోని 'మహర్షి పాణిని యూనివర్సిటీ' 'గౌరవ డాక్టరేట్' తోను సత్కరించింది. కాగా ఇప్పుడీ అవార్డు ప్రకటించిన నేపథ్యం లో - 'గీత' పట్ల తన అంకిత భావాన్ని గత 16 సంవత్సరాలుగా గుర్తిస్తూ వచ్చిన కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖామంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, అలాగే సంగీత నాటక అకాడమీ' అకాడమీ చైర్మన్ డా॥ సంధ్య పురేచ కు, జ్యూరీ సభ్యులకు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కు గంగాధర శాస్త్రి కృతజ్ఞతలు తెలియజేసారు. ఇది తనకు తొలి జాతీయ అవార్డు అన్నారు. ఈ అవార్డు - పాట నేర్పిన తన తల్లి తండ్రులకు, 'గీతా గాన మార్గదర్శి' ఘంటసాల కు, గీతా సద్గురువులకు, శాస్త్రీయ సంగీతం నేర్పిన గురువులకు అంకితమన్నారు. 'భగవద్గీత' అంటే భారతదేశపు ఆలోచనా విధానమని, ఇది మతాలకు అతీతమైన, సర్వజనామోదయోగ్యమైన, ఆచరణీయమైన, అత్యుత్తమమైన కర్తవ్య బోధ అనీ, దీనిని ప్రతి ఒక్కరూ చదివి, అర్థం చేసుకుని, ఆచరించడం ద్వారా స్వార్థరహిత ఉత్తమ సమాజాన్ని ఏర్పరచవచ్చని, అందుకే తమ 'భగవద్గీతా ఫౌండేషన్' ద్వారా గీతా ప్రచారం కోసమే తన జీవితాన్ని అంకితం చేశానని గంగాధర శాస్త్రి అన్నారు. భగవద్గీతను జాతీయ గ్రంథం గా ప్రకటించడం ద్వారా ఈ దేశపు జ్ఞాన సంపదను గౌరవించాలని భారత ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలనూ కోరుతున్నామని, గీతను పాఠ్యాంశం గా చేర్చి బాల్య దశ నుంచే పిల్లలకు నేర్పించడం ద్వారా, మానవీయ విలువలను పెంపొందించవచ్చని ఆయన అన్నారు. ఇప్పటికే అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా భారతీయుల ఆత్మ గౌరవాన్ని కాపాడినందుకు, పాఠ్య పుస్తకాల్లో మన దేశం పేరుని భారత్ గా మార్పుచేసి చరిత్ర ను కాపాడినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు..

# నేడే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, శ్రీ వాసవి కళ్యాణ సదన్ శంకుస్థాపన

- ఆర్యవైశ్యులందరూ షాపులు మూసేసి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనండి- దేవకి




**కనిగిరి, కలంకౌంటర్ :** నేడు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, శ్రీ వాసవి కళ్యాణ్ సదన్ శంకుస్థాపన కార్యక్రమంలో కనిగిరి పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ షాపులు మూసేసి ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొనాలని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గౌరవాధ్యక్షులు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దేవకి మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో నేడు ఉదయం 11 గంటల 49నిం లకు కనిగిరి బొడ్డుచాగుడి వద్ద ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి ఆలయ శంకుస్థాపన, శ్రీ వాసవి కళ్యాణ సదన్ శంకుస్థాపన జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రెసిడెంట్ దేవకి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కొలిపర్తి వెంకటస్వామి, కోశాధికారి బచ్చు రమేష్ ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమం జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమానికి తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ , చైతన్య తపోవన శివ కేశవ పీఠం స్థాపకులు పూజ్య శ్రీ మాతాజీ శివానంద సరస్వతి, శ్రీ విద్యాపీఠం పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞా సరస్వతి స్వామీజీ, సిద్ధ జ్ఞాన ఆశ్రమం పీఠాధిపతి శుద్ధ చైతానంద స్వామీజీ చేతులు మీదుగా శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగునని దేవకి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం అత్యంత అద్భుతంగా సుందరంగా రాతి కట్టడంతో నిర్మాణాన్ని తలపెట్టినామని, ఈ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన దాతలు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి భక్తులు, కనిగిరి పట్టణ ఆర్య వైశ్యులు అందరూ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవకి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

# మానవ జీవితంలో సైన్స్ ఎంతో కీలకం - ఇన్చార్జి హెచ్ఎం విప్రనారాయణ



**కందుకూరు,కలంకౌంటర్ :** మానవ జీవితంలో సైన్స్ ఎంతో కీలకమని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు విప్రనారాయణ అన్నారు. కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు ఇన్చార్జి ప్రధానోపా ధ్యాయులు విప్రనారాయణ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశం లో విప్రనారాయణ మాట్లాడుతూ మానవ జీవితంలో సైన్స్ ఎంతో కీలకమని అన్నారు. సర్ సివి రామన్ 1928 రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవం గా జరుపుకుంటామని తెలిపారు. డాక్టర్ సి వి రామన్ కు రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా నోబెల్ బహుమతి అందజేశారని తెలియజే శారు. విద్యార్థులు చిన్నతనం నుంచి ప్రశ్నించడం పరిశీలించడం అవగాహన చేసుకోవడం శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని విద్యార్థులను కోరారు. చిన్నపిల్లల శాస్త్రవేత్తలుగా అనేక ప్రయోగాలు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఉపాధ్యాయులు సీనియర్ ఉపాధ్యాయులు మహల్యారావు, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, సైన్సు ఉపాధ్యాయులు శ్రీనిధి, సందాని భాషా, సరస్వతి, కొండమ్మ, మురళీకృష్ణ, తలపనేని శీను తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ నిర్వహణ



**కందుకూరు,కలంకౌంటర్ :** టీ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 'ప్రపంచ సంక్షేమం కోసం ప్రపంచ సైన్స్'లి అనే థీమ్ తో ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ గారు విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. భారతీయ శాస్త్ర వేత్తల ఆవిష్కరణలు, పరిశోధనలు ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తోందని తెలిపారు. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ. ఐ) (కృత్రిమ మేధస్సు) యొక్క ప్రాముఖ్యతను మరియు ప్రభుత్వ సేవలు, రక్షణ, వ్యవసాయం, విద్యా వైద్య రంగాల్లో ఏ. ఐ. యొక్క వినియోగాన్ని, మున్ముందు ప్రపంచంలో అత్యధిక ఏ. ఐ. సిబ్బంది భారతదేశంలోనే తయారవుతున్నారనీ, ఇతర దేశాలకు ఏ.ఐ. నిపుణులను ఎగుమతి చేసే సత్తా భారత దేశానికి ఉన్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్వి శ్రీహరి విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవం విశిష్టతను మరియు రామన్ ఫలిత అనువర్తనాలను తెలియజేశారు. కళాశాలలో ఇటీవలే రీసెర్చ్ సెంటర్ లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన తెలియజేశారు. సైన్స్ యొక్క ప్రాముఖ్యతను కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర తెలియజేశారు. విద్యార్థులను ఉద్దేశించి భౌతిక శాస్త్ర అధ్యాపకులు కృష్ణ శర్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి కమల బాబు, డాక్టర్ తిరుపతి స్వామి, డాక్టర్ అనూష, డాక్టర్ హనుమంతరావు, కే శ్రీనివాసులు, డాక్టర్ జోనా ఫిలిప్ లు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి అన్న ప్రసాద భవనానికి రూ25000/-లు విరాళం



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలో కనిగిరి రోడ్ లో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి గుడి వెనక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనముకు అనంతసాగరం వాస్తవ్యులు బైరపనేని.శ్రీనివాసరావు ధర్మపత్ని ధనమ్మ అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కొరకు రూ?. 25,000/-విరాళము శ్రీ అయ్యప్ప సేవా సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి అన్నప్రసాద భవనానికి విరాళం అందజేసిన వారికి వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఉంటాయని అన్నారు. ఈకార్యక్రమంలో శ్రీ అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులుకే .ఎస్ .వెంకటేశ్వర్లు (గురుస్వామి) ఇస్కాల.వెంకట నరసింహ, నల్లబోతుల.మురళి, మాదాలవెంకటేశ్వర్లు, కాటా.చెంచురామయ్య, దాసరి.శ్రీనివాసులు, ఉన్నం.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు





**మచిలీపట్నం కల్చరల్,కలంకౌంటర్ :** మచిలీపట్నం కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు తుమ్మలపల్లి జగన్నాథం దంపతులు వివాహ వార్షికోత్సవ సందర్భంగా సన్మానించిన అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు,ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ జల్లూరి గోపీ, ఉమ్మడి కృష్ణా జిల్లా టాక్స్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉడత్తు శ్రీనివాసరావు, వాసవి క్లబ్ ఐ పి సి యండూరి సురేష్, వాసవి క్లబ్ జెడ్ సి అశోక్ కుమార్, వాసవి క్లబ్ ట్రెజరర్ జయవరపు ప్రసాద్ తదితరులు.

# చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన రాయలసీమ విద్యార్థి జేఏసీ నేతలు





**అమరావతి,కలంకౌంటర్ :** రాయలసీమకు చెందిన వివిధ విద్యార్థి సంఘాల నేతలు టీడీపీలో చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో బుధవారం రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ బి.శ్రీనివాసులు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ. ...జాబ్ కేలండర్ పేరుతో వైసీపీ యువతను మోసం చేసిందని, ఈ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీకి యువత బుద్ధి చెప్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో సి.రాజు(రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ కో కన్వీనర్), కె.చంద్రశేఖర్(రాయలసీమ యూనివర్సిటీ జేఏసీ కన్వీనర్), జి.లక్ష్మణ్(రాయలసీమ యూనివర్సిటీ జేఏసీ కో కన్వీనర్), పి.వెంకటేష్(ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు), బి.నవీన్ కుమార్(రాయలసీమ విద్యార్థి జేఏసీ), సి.ఏసేపు(ఏపీ నిరుద్యోగుల వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షులు), మహబూబ్ బాషా(మైనారిటీ హక్కుల పోరాట సమితి), కె.శ్రీనివాసులు, కె.నవీన్(రాయలసీమ పరిరక్షణ సమితి స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు), బి.మధు(ఏపీ నిరుద్యోగుల వేదిక నాయకలు) తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు కో-ఆర్డినేటర్ గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# గిరిజనుల భవితవ్యం చంద్రబాబు గెలుపుతో సాధ్యం

- చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి





**పాడేరు,కలంకౌంటర్ :** గిరిజన ప్రాంతాల అభివృద్దే చంద్రబాబు ధ్యేయమని, గిరిజిన ప్రాంతాలపై చంద్రబాబుకు ఎనలేని ప్రేమాభిమానాలు ఉన్నాయని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి పాడేరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా పాడేరులోని గిరిజన మహిళలతో భువనేశ్వరి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు.

**గిరిజనులకు చంద్రబాబు పథకాలు తెస్తే జగన్ రద్దు చేశారు :** గిరిజనులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలనే దూర దృష్టితో చంద్రబాబు అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారు. గిరిజనులు విదేశాల్లో చదువుకోవాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ విద్యోన్నతి పథకాన్ని అమలు చేశారు. గిరిజన గర్భిణీలు, బాలింతలకు గిరి గోరుముద్ద, చిన్నారులకు బాలామృతం పథకాలు అమలు చేశారు. పుట్టిన బిడ్డల కోసం ఎన్టీఆర్ బేబీకిట్ పథకాన్ని అమలు చేశారు. ప్రసవించిన అనంతరం తల్లిబిడ్డను ఇంటికి సురక్షితంగా చేర్చేందుకు తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ పథకాన్ని అమలు చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్సులు పెట్టి వైద్యసదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు. గిరిజన బిడ్డల కోసం బెస్ట్ అవెయిలబుల్ స్కూల్స్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేశారు. ఇలాంటి మంచి మంచి పథకాలను జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రద్దు చేసి గిరిజనులకు సంక్షేమాన్ని దూరం చేశారు. వైసీపీ ప్రభుత్వం పని రద్దు చేయడం, కూలదోయడమేనన్నారు.

**అరకును ప్రమోట్ చేసిన వ్యక్తి చంద్రబాబు :** అరకు ప్రాంతం విశిష్టతను ఈ దేశానికి, ప్రపంచానికి చాటి చెప్పేందుకు చంద్రబాబు ఎంత కష్టపడ్డారో అరకు ప్రాంతం ప్రజలందరికీ తెలుసు. చంద్రబాబు గిరిజన ప్రాంతాలకు చేసిన అభివృద్ధిపై నాకు దాదాపు పావుగంట పాటు వివరించారు. తెలుగుదేశం పాలనలో అభివృద్ధిలో దూసుకుపోయిన గిరిజన ప్రాంతాలు నేడు సరైన రోడ్లు కూడా లేని దుస్థితికి వచ్చాయంటే దానికి కారణం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం. అరకు అంటే ఎవరికైనా గుర్తుకొచ్చేది అరకు కాఫీ. అరకు కాఫీ అభివృద్ధికి చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహం గతంలో ఎవరూ ఇవ్వలేదు. వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. అరకు ప్రాంతంలో పండే పంటలకు అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లో గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబుది. అరకు కాఫీకి యూకే, ప్యారీస్, ఇతర దేశాల్లో ప్రమోట్ చేసి అంతర్జాతీయంగా అరకు కాఫీకి ఖ్యాతిని సంపాదించిన వ్యక్తి చంద్రబాబు. కుటుంబాన్ని, సన్నిహితులను ప్రక్కనపెట్టి రాష్ట్రం కోసం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం చంద్రబాబు కష్టపడి పనిచేశారు. గిరిజనులు కూడా చంద్రబాబుపై ఎనలేని ప్రేమాభిమానాలు చాటుకున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో గిరిజన ప్రాంతాలన్నీ తల్లడిల్లాయి. శాంతియుత ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేసి మాకు అండగా నిలిచారు. వైసీపీ ప్రభుత్వం శాంతియుత నిరసనలు చేసిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపింది...మహిళలను స్టేషన్లకు తీసుకెళ్లి అర్ధరాత్రి వరకు స్టేషన్లలోనే నిర్బంధించి కర్కశంగా వ్యవహరించారన్నారు.

**జగన్ పాలనలో గంజాయి, లిక్కర్, శాండ్ మాఫియాలో ఏపీ నంబర్ వన్ :** చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు తీసుకురావడంలో నంబర్ వన్ గా ఉండేది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఏపీని గంజాయి, డ్రగ్స్, కల్తీ లిక్కర్ మాఫియా, శాండ్ మాఫియా, మహిళలపై అఘాయిత్యాలు, రైతుల ఆత్మహత్యల్లో నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రజలకు తాత్కాలిక పథకాలను ఇచ్చి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దూరం చేస్తున్న మోసకారి ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అన్నారు.

**ప్రశ్నిస్తున్నారనే చంద్రబాబు అరెస్టు :** వైసీపీ ప్రభుత్వ దుర్మార్గాలను ప్రశ్నిస్తున్నారనే కోపంతో చంద్రబాబుపై ఆధారాలు లేని కేసులు పెట్టి అక్రమంగా 53రోజులు జైల్లో నిర్బంధించారు. చంద్రబాబును అరెస్టు చేసి మా కుటుంబాన్ని, చంద్రబాబును రోడ్డుమీదకు రాకుండా చేయాలని జగన్ ప్రభుత్వం కుట్ర చేసింది. చంద్రబాబు, మేము ఎక్కడా అధైర్యపడలేదు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మనస్తాపంతో మరణించిన కార్యకర్తల గురించి చంద్రబాబు జైల్లో ఉండి ఆలోచించారు తప్ప అప్పుడు కూడా మా కుటుంబం గురించి ఆలోచించలేదు. చనిపోయిన కార్యకర్తల ఇళ్లకు వెళ్లి, పరామర్శించి వారికి పార్టీ అండగా నిలబడుతుందనే ధైర్యాన్ని నింపాలని చంద్రబాబు తాను కష్టంలో ఉన్న సమయంలో నాతో చెప్పారు. పార్టీ అంటే, కార్యకర్తలంటే చంద్రబాబుకు అంత ప్రాణం. ఆయన బలం కార్యకర్తలు, మహిళలు. చంద్రబాబును మరిన్ని కేసుల్లో ఇరికించి ప్రజలకు దూరం చేయాలని వైసీపీ ప్రభుత్వం ఎన్నో కుట్రలు పన్నింది కానీ. వాళ్ల వల్ల కాలేదన్నారు.

**లీడర్ అంటే చంద్రబాబా? జగనా:** ప్రజల కోసం ఏ కష్టమొచ్చినా నిలబడి, పోరాడి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేవాడే నిజమైన లీడర్. ఏ తప్పూ చేయకుండా, కుటుంబాన్ని సైతం ప్రక్కనపెట్టి ప్రజల కోసం, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించిన వ్యక్తి చంద్రబాబు. కష్టకాలంలో ఉండి కూడా ప్రజల కోసం ఆలోచించిన వ్యక్తి చంద్రబాబు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై, ప్రభుత్వ దోపిడీ విధానాలపై పోరాడిన వ్యక్తి చంద్రబాబు. డబ్బులు కోసం, తమ ఖజానాలు నింపుకోవడం కోసం అడ్డొచ్చిన వారిని తొలగించుకుంటూ వెళ్లేవారిని ఏమనాలి?. వైసీపీ నాయకులు, జగన్మోహన్ రెడ్డి డబ్బు ఎక్కడుంటే అక్కడుంటారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన వర్గాల పక్షాన నిలబడే వ్యక్తి చంద్రబాబు. 2014-19 పాలనలో ఏపీకి అనేక పరిశ్రమలు, కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి చంద్రబాబు. చంద్రబాబు తీసుకొచ్చిన కంపెనీలను కమీషన్ల కోసం వేధించి ప్రక్కనున్న రాష్ట్రాలకు వాటిని తరిమేసి రాష్ట్ర యువతను నిరుద్యోగులుగా మార్చిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు.

# మహా పూర్ణాహుతితో ముగిసిన రాజ్యలక్ష్మీ సుదర్శన లక్ష్మీ నారసింహ యాగం





**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్రప్రజలు సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండాలని కోరుతూ, నారా చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ గన్నవరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు చేపట్టిన సుదర్శన యాగం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలోని టిడిపి మండల కార్యాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న యాగం చివరి రోజు అయిన బుధవారం ఉదయం యాగ్నిక స్వామి వేదాంత ప్రవీణ డాక్టర్ బాలకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో 75 మంది రుత్వికుల యాగమంత్రోచ్ఛారణల మధ్య యార్లగడ్డ వెంకట్రావు జ్ఞానేశ్వరి దంపతులు యజ్ఞకులుగా స్వస్తి వాచనం, గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర పూజలు నిర్వహించారు. తదుపరి మనరాష్ట్రంలో ఇంతవరకూ ఎక్కడా చేయని విధంగా కేరళ తంత్రశాస్త్ర ప్రకారం కుండా మండల బింబ పూజ చేశారు. అనంతరం యాగశాల ఆరాధన చేసి త్రయాహ్నిక, త్రయాగ్నిక, త్రయ కుండలాత్మక పూజల అనంతరం విజయవల్లి సమేత సుదర్శన లక్ష్మీ నారసింహ యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 3500 రకాల వన మూలికలు, సుగంధ ద్రవ్యాలను సుదర్శన శతకంతో ఆవనం చేసి హోమ గుండానికి సమర్పించి మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం యార్లగడ్డ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా భక్తులకు పసుపు, కుంకుమలు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం 3వేలమంది భక్తులకు హోమ కంకణాలను అందించి మహా ప్రసాద వితరణ, అన్న ప్రసాద వితరణ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మూల్పూరి బాలకృష్ణారావు, డాక్టర్ దాసరి బాలవర్ధన రావు, నాయకులు బొప్పన భవకుమార్, గుడవల్లి నరసయ్య, బొప్పన హరి, దొంతు చిన్న, ముల్పూరు సాయి కళ్యాణి, మండవ రమ్య, గుజ్జర్లపూడి బాబురావు, కోనేరు సందీప్, పరుచూరి నరేష్, తదితరులు ఈ పూజాకార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు....

# 'వాలంటీర్ వ్యవస్థ' ప్రపంచానికే ఆదర్శనీయం


- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



**తణుకు, కలంకౌంటర్ :** ప్రజలతో మమేకమై సేవలందించే 'వాలంటీర్ వ్యవస్థ' ప్రపంచానికే ఆదర్శనీయమని రాష్ట్ర పౌరసరఫ రాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం తణుకు మునిసిపల్ బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'వాలంటీర్లకు అభినందన' కార్యక్రమం లో మంత్రి ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమం ద్వారా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లకు దుశ్శాలువా, మెడల్, ప్రశంసాపత్రం, నగదు బహుమతితో ఘనంగా మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభు త్వ సేవలను ప్రజల ఇంటివద్దకు అందిస్తూ, ప్రజల జీవితాలలో ఒక భాగమైన వాలంటీర్ వ్యవస్థను ప్రపంచంలోనే మొదటి సారిగా మన రాష్ట్రంలో మన సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారన్నారు. వాలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. ఇటువంటి వ్యవస్థ ద్వారా వాలంటీర్లు సేవే పరమావధిగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రతినిధులుగా ప్రజలకు సేవలందిస్తున్న వాలం టీర్లు ప్రజల జీవనవిధానంలో ఒక భాగమ య్యారన్నారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను పేదల సంక్షేమానికి అమలు చేస్తున్నదని, వాటిని అర్హులైన వారికి అందించేందుకు వాలంటీర్లు చేసిన సేవ మరువలేనిదని, సేవలలో వాలంటీర్లు కూడా మరో రత్నం లా మెరిసారన్నారు. కోవిడ్ సమయంలోను, ఫీవర్ సర్వే, గోదావరి వరదల సమయంలో వాలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు నిరుపమానమైనవని మంత్రి కొనియాడారు. వాలంటీరుగా కాక ఆయా కుటుంబాల సభ్యులుగా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. గౌరవ వేతనానికి పనిచేయడానికి వచ్చిన వారుకూడా ప్రజలకు సేవలందించే సమయంలో వారి కళ్ళలో ఆనందాన్ని చూసి ప్రజలకు సేవచేయడంలో ఇంత ఆనందం ఉందా అని చాలా మంది వాలంటీర్లు వృత్తిపరమైన సంతృప్తి అనుభూతిని చెందుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు వాలంటీర్లు తమ అనుభవాలను పంచుకుంటూ ప్రజలకు సేవలు అందించే గొప్ప అవకాశాన్ని ప్రభుత్వం తమకు కల్పించిందని తాము భావిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తణుకు మున్సిపల్ కమీషనర్ బీవీ రమణ, ఏఎంసీ చైర్మన్ నత్త కృష్ణవేణి, వైఎస్సార్సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తక్షణమే కారుణ్య నియామాకాలు చేపట్టాలి

- ఉపాధ్యాయుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి
- సరిపడా అదనపు పోస్టులు క్రియేట్ చేసి ఉద్యోగాలు కల్పించాలి
- ఎన్నికల నోటిఫికేషన్ లోపు కారుణ్య నియమాకాల ఉత్తర్వులు జారీ చేయాలి
- ఏపిజేఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



**విజయవాడ,కలంకౌంటర్ :** జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తూ చనిపోయిన వందలాది మంది ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ కుటుంబాల్లో అర్హత కలిగిన వారి కుటుంబ సభ్యులకు తక్షణమే ప్రభు త్వం కారుణ్య నియామాకాలు చేపట్టాలని ఏపిజేఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిల్లాపరిషత్ పరిధిలో కారుణ్య నియామాకాలు వెంటనే చేపట్టి ఉపాధ్యాయుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామో దరరావు విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ టీచర్లు, హెడ్ మాస్టర్లు కోవిడ్ ముందు, కోవిడ్ సమయం లోను, తర్వాత అనేక మంది చనిపోయి నప్పటికి, లోకల్ బాడీస్ లో పనిచేసిన ఉద్యోగులకు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం అనుమతి లేదన్నారు. గత ఆరు, ఏడు సంవత్సరాలు గడుస్తు న్నా సరే సరిపడా ఖాళీలు లేనందున వారందరికీ ఎలాంటి కారుణ్య నియామకాలు నేటికీ చేపట్టనందున, ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని నిభందనల మేరకు వీరందరికీ జిల్లాపరిషత్ పరిధి లోనే వన్ టైం సెటిల్మెంట్ క్రింద అవసరమైతే సరిపడా అదనపు పోస్టు లు క్రియేట్ చేసి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఇతర లోకల్ బా డీస్ కార్యాలయాల్లోనూ, వారి అర్హతలను బట్టి గ్రామ వార్డ్ సచివాల యాల ఉద్యోగాల్లో కూడా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఏపీ జేఏసీ అమరావతి పక్షాన గత అనేక సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరినా నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని ఏపిజేఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదర రావు అన్నారు. ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో గత సంవత్సరం ఫిబ్రవరిలో 92 రోజులు ఉద్యమం చేసినప్పుడు విజ్ఞప్తులు చేయడమే కాకుండా, తదుపరి ఈమధ్య కాలంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారిని కలసి లేఖలు ఇస్తూ విజ్ఞప్తులు చేయడమే కాకుండా ఈనెల 12 , 23 తేదీల్లో జరిగిన మంత్రి వర్గ ఉపసంఘం చర్చల్లో జాయింటు స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com